క్లుప్తంగా

మొక్కలు నాటి.. కాపాడే బాధ్యత అందరిదీ



మొక్క అందజేస్తున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: మొక్కలు నాటి వాటిని రక్షించే బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి కోరారు. పట్టణంలోని శాంతినగర్ (21వ వార్డు)లో గురువారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పండ్లు, పూల మొక్కలను పంపిణీ చేశారు. వార్డు ఆఫీసర్ అనిల్‌కుమార్, నర్సరీ ఇన్‌చార్జి సదానందం, మెప్మా ఆర్పీ అజ్మిత ఉన్నారు.

ప్రమాదకరంగా ఉన్న బావుల పరిశీలన



బావిని పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో మంచినీటి బావులు ప్రమాదకరంగా ఉన్నాయని రక్షణ చర్యలు చేపట్టాలని సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ జగదీష్ గురువారం మంచినీటిబావులను పరిశీలించారు. బావులు ప్రమాదకరంగా ఉన్నాయని గుర్తించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరలోనే రక్షణ చర్యలు చేపడతామని ఎంపీడీవో భాస్కర్‌రావు 'సాక్షి'కి తెలిపారు.


బ్రిడ్జి నిర్మాణ స్థలం పరిశీలన



నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్

ధర్మారం: మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డుకు నూతనంగా బ్రిడ్జి నిర్మాణం కోసం గురువారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్లా నాయక్ పరిశీలించారు. మండలంలోని బొమ్మారెడ్డిపల్లి నుంచి ధర్మారం మీదుగా ఎండపల్లి జగిత్యాలకు వెళ్లే రోడ్డును కలిపే పాత రోడ్డుకు బ్రిడ్జి ఆవశ్యకతను గ్రామ ప్రజలు ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌కు వివరించారు. స్పందించిన విప్ వెంటనే ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. విప్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ పరిశీలించారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోగాల తిరుపతి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశం గౌడ్, మార్కెట్ డైరెక్టర్ కాంపెల్లి రాజేశం, నాయకులు ఓరం చిరంజీవి, సలాది చంద్రయ్య, దేవి, అఖిల్ ఉన్నారు.

వీల్‌చైర్ అందజేత



వీల్‌చైర్ అందజేస్తున్న చిన్నారులు

ఓదెల: మండలంలోని గోపరపల్లె గ్రామంలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మంచానికి పరిమితమైన పోలపల్లి సంపత్‌రెడ్డికి సుల్తానాబాద్‌కు చెందిన ఏగోలపు సదయ్యగౌడ్ పిల్లలు జ్యోషిక, కౌశిక్ గురువారం వీల్‌చైర్ అందజేశారు. సంపత్‌రెడ్డి నడవడానికి ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న చిన్నారులు దాత అల్లెంకి ఆనందం సాయంతో వీల్‌చైర్ అందజేశారు. చిన్నారులను గ్రామస్తులు అభినందించారు. ఏగోలపు సదయ్యగౌడ్, మార్క శ్రీనివాస్‌గౌడ్, తోట ఐలయ్యగౌడ్, కాశవేని చేరాలు, మేకల రవీందర్ రెడ్డి, దొంగల రవి, నరేశ్, ఆసరి చేరాలు, జంగ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్–2 పరీక్ష వాయిదా వేయాలి

పెద్దపల్లిరూరల్: నిరుద్యోగ యువతకు మేలు కలిగేలా గ్రూపు–2, 3 పోస్టులను పెంచాలని, గ్రూపు–2 పరీక్ష వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ల సందీప్, ప్రశాంత్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేశ్‌మార్య డిమాండ్ చేశారు. జిల్లా గ్రంథాలయం ఎదుట గురువారం నిరుద్యోగ యువతతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న పోస్టుల సంఖ్యను పెంచి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్ధార్థ, రోషన్, రాజు, శ్రీనివాస్, నవీన్ ఉన్నారు.

అమాత్య.. మాగోడు వినుమా

- నేడు జిల్లాలో మంత్రుల బృందం పర్యటన
- పామాయిల్ ఇండస్ట్రీ, ఆసుపత్రి ప్రారంభోత్సవం, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- పెండింగ్ సమస్యల పరిష్కారంపై గంపెడాశలు



పెద్దపల్లి బస్‌స్టాండ్

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలోని ఓదెల మండం కొలనూర్‌లో పీహెచ్‌సీ ఆసుపత్రి, రోడ్డు ప్రారంభోత్సవం, కాల్వశ్రీరాంపూర్ మండలం పెద్దరాతుపల్లిలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన కార్యక్రమాల్లో శుక్రవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిల్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొననున్నారు. అనంతరం రెడ్డి గార్డెన్స్‌లో ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులతో మాట్లాడనున్నారు. ఈసందర్భంగా తమ ప్రభుత్వం ఆరునెలల్లో ఏం చేసింది? భవిష్యత్‌లో చేయబోయే పనులను మంత్రుల బృందం వివరించనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను మంత్రుల పర్యటన సందర్భంగా 'అమాత్య... మా గోడువినుమా' అంటూ జిల్లావాసులు వేడుకుంటున్నారు.

పెద్దపల్లి బస్‌డిపో ఏర్పాటు

జిల్లా కేంద్రంగా, రైల్వే జంక్షన్ ఉన్నా పెద్దపల్లిలో బస్ డిపో మాత్రం ఏర్పాటు కాలేదు. మూడు దశాబ్దాలుగా ఇక్కడ బస్ డిపోను ఏర్పాటుచేయాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. రెండుసార్లు ఇక్కడ బస్ డిపో ఏర్పాటుకు మంజూరైనా రద్దుచేసి ఒకసారి గోదావరిఖనిలో, మరొకసారి మంథనిలో డిపోను ఏర్పాటు చేశారు.

ముంపునకు కరకట్ట కట్టేనా..

కాళేశ్వరం బ్యాక్‌వాటర్‌తో గోదావరి పరివాహక ప్రాంతంలోని గోదావరిఖని, మంథని పట్టణాలు నీటమునుగుతున్నాయి. సుందిళ్ల బ్యారేజీ నిర్మాణంతో రామగుండం ప్రాంతానికి ముప్పు ఉందన్న ల్యాడర్ సర్వేలో తేలటంతో గోదావరి ఒడ్డున 8కిలోమీటర్లు సుందిళ్ల వరకు కరకట్ట నిర్మించి వదిలేశారు. రామగుండం వరకు మరో 5కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించేందుకు రూ.110 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. అది కార్యరూపం దాల్చకపోవడంతో ప్రతిపాదనలకే పరిమితమై ముంపునకు గురయ్యాయి. మంథనిలో గోదావరి మానేరు, బొక్కలవాగు తీరం వెంట పంట భూములు. ఇళ్లు మునిగి రూ.కోట్ల నష్టం వాటిల్లుతుంది. ఏటా 10వేల ఎకరాల్లో పంటలు, 2వేల ఇల్లు నీట మునుగుతున్నాయి. వందల ఎకరాల్లో ఇసుక మేటలు వేసి రైతులు నష్టపోతున్నారు. దీంతో కరకట్ట నిర్మాణానికి నిధుల మంజూరుపై ఎదురుచూస్తున్నారు.

గోదావరి ఒడ్డే డంపింగ్‌యార్డు

రామగుండం కార్పొరేషన్ 50డివిజన్లు, సుమారు 2.50లక్షల జనాభా, 93 చదరపు కి.మీ విస్తీర్ణం, రోజుకు 115 మెట్రిక్ టన్నుల చెత్తసేకరణ. కానీ చెత్త పోసేందుకు 'డంపింగ్ యార్డు'లేని దుస్థితి. దీంతో బల్దియా చెత్తను తాత్కలికంగా గోదావరి నది ఒడ్డున చెత్తను తరలిస్తుండటంతో, ఆ పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. అలాగే మంథనిలో సైతం డంపింగ్‌యార్డ్ లేకపోవడంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండలాలు ఏర్పాటు అయ్యేనా..

జిల్లాలో కొత్త మండలాలు రావాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. పరిపాలనా సౌలభ్యం కోసం మండలాలు ఏర్పాటు చేయాలని ఆయా మండలాల సాధనకమిటీ సభ్యులు కోరుకుంటున్నారు. పెద్దపల్లిలో గర్రెపల్లి, మంథని నియోజకవర్గంలో గుంజపడుగు మండలానికి కావాల్సిన అన్ని అర్హతలున్నాయని, జిల్లాల పునర్విభజన సమయంలోనే ప్రతిపాదనలు పంపినా ఏర్పడలేదు. ఇప్పటికైనా ఈ రెండు మండలాలు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విమానం ఎగిరేనా..?

1980లో కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ అధినేత బీకే బిర్లా వచ్చేందుకు 294 ఎకరాల విస్తీర్ణంలో విమానాశ్రయం నిర్మించారు. 21సీట్ల సామర్థ్యం ఉన్న చిన్న విమానాలు రాకపోకలు సాగించేవి. 2009లో ఈ ఎయిర్‌పోర్టును రామగుండం ఎయిర్‌పోర్టుగా 500 ఎకరాల విస్తీర్ణంతో అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు నడిచినా తర్వాత అవి అటకెక్కాయి. 2016లో ఉడాన్ పథకంలో భాగంగా 2020లో ఎయిర్ ఫోర్స్ అథారిటీ ఆఫ్ఇండియా రాష్ట్ర ప్రభుత్వంతో పలు భౌగోళిక సర్వేలు నిర్వహించింది. దీనిపై మంత్రులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా ప్రకటన చేయాలని పారిశ్రామిక వర్గాలు కోరుతున్నాయి. విమానాశ్రయం ఏర్పాటుతో పర్యాటకంగా, పారిశ్రామికంగా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశాలు మెరుగుపడనున్నాయి.

మరికొన్ని పెండింగ్ సమస్యలు

- అంతర్గాం–మంచిర్యాల మీదుగా గోదావరిపై బ్రిడ్జి నిర్మాణానికి ముందుకు పడని అడుగులు.
- పెద్దపల్లి, రామగుండం కార్పొరేషన్ పరిధిలో బైపాస్ రోడ్ల నిర్మాణం.
- బసంత్‌నగర్ సమీపంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయి 3నెలలైనా ప్రారంభించలేదు
- రామగుండంకు మంజూరైన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం రామగుండంకు తరలించాల్సిన అవసరం ఉంది. జిల్లా కేంద్రంలో గ్రంథాలయానికి శాశ్వత భవన నిర్మాణం.
- జూలపల్లి మండలంలో వడకాపూర్ వద్ద హుస్సేనిమియా వాగుపై వంతెన నిర్మాణం.
- 2017లో ఏడేళ్ల క్రితం మల్యాపూర్ చెరువును రూ.2 కోట్ల అంచనాలతో మినీ ట్యాంక్ బండ్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు. అయితే ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి.

ముస్తాబైన కొలనూర్ పీహెచ్‌సీ

- నేడు ప్రారంభించనున్న మంత్రులు
- రూ.కోటి56లక్షల వ్యయంతో నిర్మాణం
- చుట్టుపక్కల పది గ్రామాలకు అందనున్న వైద్యసేవలు



ప్రారంభానికి సిద్ధంగా పీహెచ్‌సీ

ఓదెల: మండలంలోని కొలనూర్ గ్రామంలో ఆధునీకరణ పద్ధతుల్లో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనం శుక్రవారం మంత్రులతో ప్రారంభం కానుంది. 15వ ఆర్థికసంఘం నిధులు రూ1.56కోట్లతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణం పూర్తయింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దుద్దిల్ల శ్రీదర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు చేతుల మీదుగా శుక్రుఆవారం ప్రారంభోత్సవం జరగనుంది.

పది గ్రామాలకు అందనున్న వైద్యసేవలు

ఇప్పుడున్న పీహెచ్‌సీని 1972లో అప్పటి సీఎం జలగం వెంగళరావు హయాంలో ప్రారంభించారు. కానీ ఆరోగ్యకేంద్రం ప్రస్తుతం శిథిలావస్థలోకి చేరింది. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా 15వ ఆర్థికసంఘం నిధుల కింద 1.56కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. కొలనూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ద్వారా ఉప్పరపల్లె, గోపరపల్లె, హరిపురం, కొలనూర్, మడక, కనగర్తి, గుండ్లపల్లె గ్రామాలకు వైద్యసేవలు అందుతాయి. ప్రస్తుతం నిర్మించిన ఆరోగ్యకేంద్రంలో డాక్టర్‌కు ప్రత్యేక గది, స్త్రీలకు ప్రత్యేక వసతులు, రోగులకు విశాలమైన ఓపీ రూం, వైద్యసిబ్బందికి గది, ల్యాబ్‌గది, స్టాఫ్‌నర్సులకు గది, ప్రత్యేక గదులతో ఆధునీకరణ పద్ధతిలో నిర్మించారు. రోగులకు పడక గదులు నిర్మించారు. అందుబాటులో అందరికీ వైద్యం, 24గంటల వైద్య సౌకర్యం ఏర్పాటు కల్పించినట్లు అధికారులు పేర్కొన్నారు.

మంత్రుల పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సూచనలు చేస్తున్న కలెక్టర్, రామగుండం సీపీ

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెద్దరాతుపల్లిలో శుక్రవారం ఆయిల్‌పాం ఫ్యాక్టరీ శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు శ్రీపాదరావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొనన్నారు. ఈ మేరకు భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం సీపీ శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టే పరిసరాలను పరిశీలించి పోలీసులకు తగు సూచనలు చేశారు. పెద్దపల్లి డీసీపీ చేతన, ఏసీపీ జి.కృష్ణ, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, కాల్వశ్రీరాంపూర్ ఎస్సై ఓంకార్‌యాదవ్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తాం



పరామర్శిస్తున్న నాయకులు

గోదావరిఖని: గని ప్రమాద బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ మక్కాన్‌సింగ్, మినిమమ్ వేజ్‌బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు డిమాండ్ చేశారు. గురువారం సింగరేణి ఏరియా ఆసుపత్రికి చేరుకుని ఉప్పు వెంకటేశ్వర్లు, గాదె విద్యాసాగర్ మృతదేహాలకు నివాళి అర్పించారు. మృతుల కుటుంబాలను ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను కలిసి పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మిక కుటుంబాలను అన్నివిధాలా ఆదుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ నాయకులు ఉన్నారు.

ప్రమాద బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

గోదావరిఖని: ఓసీపీ–2 ప్రమాద బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఓసీపీ–2 ప్రమాద స్థలాన్ని గురువారం పరిశీలించిన అనంతరం ఆయన ఏరియా ఆసుపత్రికి చేరుకుని కార్మికుల మృతదేహాలను పరిశీలించి నివాళి అర్పించారు. మృతుల కుటుంబాలతో మాట్లాడి ఓదార్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే రక్షణ సమావేశంలో ఉన్నతాధికారుల దృష్టికి ఈ సంఘటన తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తామన్నారు. యాజమాన్యంతో మాట్లాడి కార్మికుల కుటుంబాలకు న్యాయం చేసేలా చూస్తామన్నారు. నాయకులు వైవీరావు, మడ్డి ఎల్లాగౌడ్, జూపాక రాంచందర్, ఎంఆర్‌సీరెడ్డి, జీగురు రవీందర్, సాంబశివరావు, మాదన మహేశ్, పర్లపెల్లి రామస్వామి, పి.నాగేంద్రకుమార్, గుర్రం ప్రభుదాస్, ఏలేశ్వరం సత్యనారాయణ ఉన్నారు.

రుణమాఫీపై అన్నదాతల సంబరాలు



మంథని: ఎడ్లబండ్లపై ర్యాలీగా కాంగ్రెస్ శ్రేణులు



ధర్మారం: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



పాలకుర్తి: కన్నాల టోల్‌ప్లాజా వద్ద సంబరాలు

పెద్దపల్లిరూరల్/మంథని/పాలకుర్తి/మంథని/ఓదెల/జ్యోతినగర్/కాల్వశ్రీరాంపూర్/ధర్మారం/సుల్తానాబాద్/రామగిరి/ముత్తారం/ఎలిగేడు/జూలపల్లి/యైటింక్లయిన్‌కాలనీ/కమాన్‌పూర్: పంట సాగు పెట్టుబడి కోసం రైతులు పొందిన రుణాలను రూ.2లక్షల దాకా రుణమాఫీ చేస్తున్నట్టు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పెద్దపల్లి జిల్లావ్యాప్తంగా రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బైక్ ర్యాలీ నిర్వహించారు.

క్వార్టర్ల స్పెషల్ కౌన్సెలింగ్‌కు స్పందన కరువు



కౌన్సెలింగ్‌కు హాజరైన కార్మికుడు

గోదావరిఖని: సింగరేణి యాజమాన్యం ఆర్జీ–1 ఏరియాలో నిర్వహించిన క్వార్టర్ల కౌన్సెలింగ్‌కు కార్మికుల నుంచి స్పందన కరువైంది. కోర్టుకు వెళ్లిన 26మంది కోసం ప్రత్యేక కౌన్సెలింగ్‌ను ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ నేతృత్వంలో గురువారం రామగుండం తహసీల్దార్ జి.కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. రోడ్ల విస్తరణలో కోల్పోతున్న శివాజీనగర్, హనుమాన్‌నగర్, గాంధీనగర్‌లో నివాసముంటున్న వారికి కౌన్సెలింగ్ చేపట్టారు. కౌన్సెలింగ్‌లో ఒక క్వార్టర్ మాత్రమే కేటాయించారు. ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, హౌస్ అలాట్‌మెంట్ కమిటీ సభ్యులు రామ్మోహన్, లక్ష్మీనారాయణ, సాంబశివరావు, హనుమంతరావు, వీరారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రేడ్‌మెన్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

గోదావరిఖని: భూగర్భగనుల్లో పనిచేస్తున్న ట్రేడ్‌మెన్లకు గురువారం సర్ఫేజ్ ఉద్యోగాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. జీఎం ఆఫీస్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో జీడీకే–5 ఓసీపీ, సీఎస్‌పీ, ఎక్స్‌ప్లోరేషన్, ఏరియావర్క్‌షాప్ విభాగాల కోసం ఫిట్టర్, ఎలక్ట్రీషియన్‌లకు కౌన్సెలింగ్ చేపట్టారు. ఫిట్టర్లు 12మంది, ఎలక్ట్రీషియన్లు 9మంది హాజరయ్యారు. ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, ఏజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, సీనియర్ పీవో హనుమంతరావు పాల్గొన్నారు.

నేటి క్వార్టర్ల కౌన్సెలింగ్ వాయిదా

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలో శుక్రవారం నిర్వహించే క్వార్టర్ల జనరల్ కౌన్సెలింగ్ వాయిదా వేసినట్లు పర్సనల్ ఏజీఎం లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణలో కోల్పోతున్న కొన్ని క్వార్టర్‌ల సంబంధీకులు కోర్టును ఆశ్రయించగా అట్టి క్వార్టర్‌ల ఉద్యోగులకు గురువారం స్పెషల్ క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. అందులో క్వార్టర్లను తీసుకొనేందుకు నిరాకరించారని, దీంతో స్పెషల్ క్వార్టర్ కౌన్సెలింగ్ సోమవారం నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. జనరల్ కౌన్సెలింగ్ నిర్వహించేది ఎప్పుడనేది తర్వాత ప్రకటిస్తామన్నారు.

మాదకద్రవ్యాలపై అవగాహన ఉండాలి



గోదావరిఖనిటౌన్: మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్

గోదావరిఖనిటౌన్: గంజాయి, మాదకద్రవ్యాలు వాడితే కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఏసీపీ ఎం.రమేశ్ అన్నారు. గురువారం నగరంలోని కాకతీయ జూనియర్ కళాశాల విద్యార్థులకు గంజాయి, మాదకద్రవ్యాల వాడకం, వాటివల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, లెక్చరర్లు పాల్గొన్నారు.

డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పెద్దపల్లిరూరల్: డ్రగ్స్, గంజాయి లాంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మిద్దామని సీఐ కృష్ణ పిలుపునిచ్చారు. పెద్దపల్లి మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం 'డ్రగ్స్ వద్దు.. ప్రాణం ముద్దు' పేరిట ఏర్పాటు చేసిన సెమినార్‌లో మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మల్లేశ్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏవో పవన్ ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

యైటింక్లయిన్‌కాలనీ: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని గోదావరిఖని టూటౌన్ సీఐ ఎస్.ప్రసాద్‌రావు అన్నారు. గురువారం యైటింక్లయిన్ కాలనీలోని కృష్ణవేణి పాఠశాలలో టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

రామగుండం: అంతర్గాం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు డ్రగ్స్ తదితర మాదక ద్రవ్యాలపై అంతర్గాం ఎస్సై బోయ వెంకట్ గురువారం అవగాహన కల్పించారు.

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని ఇండియా మిషన్ సెకండరీ పాఠశాలలో డ్రగ్స్‌పై బసంత్‌నగర్ ఎస్సై స్వామి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

పెద్దెల్లి ప్రకాశ్ కుటుంబానికి పరామర్శ

గోదావరిఖని: నగరంలోని 11వ డివిజన్ కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విని ప్రకాశ్ కుటుంబాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాగూర్ గురువారం పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు ప్రకాశ్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. కాగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ నాయకులు మహంకాళి స్వామి, ముస్తఫా, గట్ల రమేశ్, రాజేశ్, దీటి బాలరాజు, రమేశ్ ఉన్నారు.

కచ్చాకాలువలతో మురుగునీరు తొలగింపు

పెద్దపల్లిరూరల్: పట్టణంలో వర్షపు నీరు, మురుగు నీరు నిల్వకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఆకుల వెంకటేశ్ తెలిపారు. పట్టణంలోని మొమిన్‌పురలో నిలిచిన నీటిని తొలగించేందుకు కచ్చాకాలువను తవ్వించే పనులను గురువారం స్థానిక కౌన్సిలర్ అమ్రేశ్ తదితరులతో కలిసి పరిశీలించారు. నీటిని మళ్లించే విషయమై కాలనీవాసులతో చర్చించారు.

గీత కార్మికుని కుటుంబానికి చెక్కు అందజేత

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన పల్లె లక్ష్మయ్యగౌడ్ గత నెలలో తాటిచెట్టుపై నుంచి కింద పడటంతో గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయాన్ని సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం జిల్లా, రాష్ట్ర కమిటీ సభ్యులు తాడి కార్పొరేషన్ చైర్మన్, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంగౌడ్‌కు తెలిపారు. మంత్రి పొన్న ప్రభాకర్‌గౌడ్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి బీసీ కార్పొరేషన్ నుంచి రూ.25వేల చెక్కును సుల్తాన్‌పూర్‌లో లక్ష్మయ్యగౌడ్ భార్య పల్లె అనసూయకు అందజేశారు. మోకుదెబ్బ గౌడసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాగిరి అంజిగౌడ్, ఎలిగేడు బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్, సంఘం రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, జిల్లా అధ్యక్షుడు వేగోళం శంకర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెర్ల వెంకటేశ్‌గౌడ్, యూత్ ఉపాధ్యక్షులు గడ్డం అనిల్‌గౌడ్, ఎలిగేడు, సుల్తానాబాద్, మానకొండూరు మండల అధ్యక్షులు పల్లెర్ల వెంకటేశ్‌గౌడ్, బండారు లక్ష్మన్‌గౌడ్, నేరేళ్ల శంకర్‌గౌడ్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రాత్రివేళల్లో ఇసుక ట్రాక్టర్లు నడపవద్దు

సుల్తానాబాద్: రాత్రి సమయంలో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించొద్దని తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్ ట్రాక్టర్ యజమానులకు సూచించారు. గురువారం సుల్తానాబాద్ మినీ కలెక్టరేట్‌లోని తహసీల్దార్ చాంబర్‌లో ఇసుక ట్రాక్టర్ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఇసుకను ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేసుకోవచ్చని సూచించారు. మండలంలోని నీరుకుల్ల, గట్టెపల్లి, కదంబాపూర్, మంచిరామి, గర్రెపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో ఉన్న మానేరు వాగుల నుంచి ఇసుక తరలించవచ్చని, రాత్రివేళల్లో చేయొద్దని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రివేళల్లో ట్రాక్టర్లు రోడ్లపై ఇసుకతో కనిపిస్తే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ప్రమాదంపై విచారణ జరిపించాలి

సుల్తానాబాద్: ఓసీపీ–2 ప్రమాదంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలో గురువారం రాత్రి సయ్యద్ హజ్రత్ అబ్దుల్ ఖాదర్ షాహిది రహ్మతుల్లా ఆలైదర్గాలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పెద్దపల్లిరూరల్: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల పరిషత్ అధికారి సుదర్శన్ అన్నారు. పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో గురువారం రోడ్లపై గుంతలను పూడ్చివేత, డ్రైనేజీలను శుభ్రం చేసే పనులు చేపట్టారు.

పోస్టర్ ఆవిష్కరణ

మంథని: హైదరాబాద్‌లో ఈ నెల 26 నుంచి మూడురోజుల పాటు నిర్వహించే ఫొటోగ్రాఫర్ల పండుగ ఎక్స్‌పో పోస్టర్‌ను గురువారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీను బాబు ఆవిష్కరించారు. దండు రమేశ్, జెట్టి శంకర్, నాగెల్లి మహేశ్ ఉన్నారు.

భారీ వర్షంతో ఫైవింక్లయిన్ మోరీ వద్ద నిలిచిన రాకపోకలు

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని ఫైవింక్లయిన్ మోరీ వద్ద గురువారం కురిసిన భారీ వర్షానికి పొంగుతోంది. డ్యూటీలకు వెళ్లే సింగరేణి కార్మికులకు అదే ప్రధాన రోడ్డు కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై నుంచి వరదనీరు పారుతుండడంతో వాహనదారులు వాహనాలను తోసుకుంటూ మోరీ దాటుతున్నారు.

కాలనీలోని ఇళ్లలోకి డ్రైనేజీ నీరు

గోదావరిఖనిటౌన్: నగరంలో గురువారం కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని 32వ డివిజన్ నవోదయకాలనీ బోర్డు వద్ద డ్రైనేజీ కాలువ పొంగి ఇళ్లలోకి మురుగు నీరు చేరుకుంది. కమిషనర్‌కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని స్థానిక కార్పొరేటర్ ఐత శివకుమార్ ఆరోపించారు. వారంక్రితం ఏఈ జమీల్ వచ్చి పరిశీలించి వెళ్లారని, ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని రామాలయంలో ఎమ్మెల్యే విజయరమణారావు ప్రత్యేక పూజలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆరోగ్యంగా జీవించాలని హోమం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ జెడ్పీటీసీ, ఎంపీపీ సారయ్యగౌడ్ నాయకులు, రైతులు పాల్గొన్నారు. అర్చక పురోహిత బ్రాహ్మణ దూపదీప సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిట్టూరి సతీశ్ శర్మ హోమం నిర్వహించారు.

సెంటనరీకాలనీలో విషాదం

రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2లో బుధవారం జరిగిన ప్రమాదంలో సింగరేణి కార్మికుడు ఉప్పు వెంకటేశ్వర్లు మృతి చెందగా సెంటనరీకాలనీలో విషాదం నెలకొంది. అందరితో కలివిడిగా ఉంటూ, గతంలో టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీగా కార్మికులకు సేవలందించిన వెంకటేశ్వర్లు మృతితో కార్మిక వర్గాల్లో విషాద చాయలు అలుముకున్నాయి. వెంకటేశ్వర్లు అంత్యక్రియలు సెంటనరీకాలనీలో నిర్వహించారు. టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డితో పాటు వివిధ యూనియన్‌ల నాయకులు అంత్యక్రియల్లో పాల్గొని నివాళి అర్పించారు.

ఏపీఏ జీఎంకు వినతి

రామగిరి: అండర్ గ్రౌండ్ గనుల నుంచి ఉపరితల గనులకు వెళ్లడానికి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని గురువారం ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లుకు డిప్లొమా మెకానికల్ ఫోర్‌మెన్‌లు వినతిపత్రం అందజేశారు.

సీఐటీయూ నాయకుల ధర్నా

గోదావరిఖని: రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకు కేటాయించాలని సీఐటీయూ నాయకులు గురువారం హైదరాబాద్‌లోని సింగరేణిభవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర నాయకులు భాస్కర్, నర్సింహారావు, రాజమౌళి, గౌస్, శంకర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.